## పేషెంట్ చెప్పే కథలు

# నీళ్ళు




నీళ్ళు ! నీళ్ళు ! నీళ్ళకోసం పేట పేటంతా గగ్గోలెత్తి పోతూంది. అప్పుడే రెండు రోజులుగా మంచినీళ్ళ టాంకర్ కోసంచూచి చూచి ప్రాణం కడగట్టిపోతూంది. ఏహారన్ వినిపించినా టాంకర్ వస్తూందని ఆశగాచూచి కాదని నిర్ధారణ కాగానే నిరాశతో తమ దుర దృష్టాన్ని తిట్టుకుంటున్నారు.

గౌరి మాటిమాటికి నాలుకతో పెదాల్ని తడుపుకుంటూంది. ఎండి పగిలిన పెదాలు తడి తగలగానే మండుతున్నాయి. రెండు రోజులుగా స్నానంలేక ఒళ్ళంతా చీదరగా వుంది. ఎప్పుడో మధ్యాహ్నం తిన్న నాలుగు మెతుకులు. ఆకలితో నకసకలాడి పోతూంది కడుపు. అత్త, భర్త తినకుండా తను తింటే అత్త పడ్డించే తిట్లు శాపనార్థాలను తలచుకుని కొంచెం మంచినీళ్ళన్నా తాగుదామని కుండమీద మూత తీసింది. ఒక్క బొట్టుకూడా లేకుండా కడిగిపెట్టి నట్లుగా వున్న కుండను చూడగానే గౌరి ప్రాణం ఉసూరుమంది. గొంతు కార్చుకు పోతుంటే ఓర్చుకోలేక ఎదురింటి నర సమ్మను కాసినీళ్ళు బదులడిగింది.

"పిల్లాజెల్లా లేన్దానివి నీ యింట్లోనే లేక పోతే మా యిళ్ళల్లో ఎక్కడుంటాయే నీళ్ళు గౌరీ! తెల్లారి లేచిందగ్గర్నుంచి బంగారంలా దాచుకున్నా ఎట్లాగొట్లా పట్టుకుబోయి పార బోస్తారు పిల్లసన్నాసులు" నరసమ్మ యింకా తన అశక్తతను ఏకరువు పెడుతూ వుండగానే కాళ్ళీడ్చుకుంటూ యింటికి చేరింది గౌరి.

"ఎక్కడికెళ్ళావే పెత్తనాలకు ? నీళ్ళ బండొస్తాందని అంతా బింది తీసుకునీ లగెత్తుతాంటే నువ్వెక్కడ సొల్లు కబుర్లు చెప్తా కూర్చున్నావా ?" అప్పటిదాకా ఊరి మీదపడి తిరిగొచ్చిన గౌరి అత్త నాంచారమ్మ కోడలివంక గుడ్లురిమి చూచింది. నీరసంతో కాళ్ళు తేలిపోతున్నా నీళ్ళబండొస్తాందనేసరికి కొండంత సంబరంతో బింది తీసుకుని వెళ్ళింది గౌరి. అప్పటికే కొండ వీటిచాంతాడంతవుంది 'క్యూ'. బలవంతులు వెనకొచ్చినా 'క్యూ'లో ముందర జొరబడుతున్నారు కొట్లాటలు, కుమ్ములాటలు, కక్కుర్తి.... రోజూ చూస్తున్న భాగోతమే అయినా యీ రోజు అసహనంగా గమనిస్తూంది గౌరి.

"ఏం బతుకులో ! గుక్కెడు మంచి నీళ్ళకూడా నోచుకోని దరిద్రపు బతుకులు. ఏ మణ్యూ మాన్యాలూ, సిరులూ, సంపదలూ, భోగభాగ్యాలూ లేకపోతేమానె గొంతు తడుపుకుంటానికి నీళ్ళన్నా లేక పోతే ఎట్లా ఈడ్చేదీ పాడుబతుకు ?"... దుఃఖంతో గౌరి గొంతు గురగురలాడింది.

"ఏదో బావుకు తిందామని నాలుగు కుంచాల చేను కౌలుకు తీసుకున్నాం. అప్పు చేసి నాట్లేస్తే నీళ్ళచుక్కలేక నేల నెర్రెచ్చి పంట మలమల మాడిపోయింది. గొడ్లూ గోదా డొక్క లెండిపోయి నోళ్ళు తెరుచుకుని చొంగలు కారుస్తున్నాయి. కడుపున పుట్టిన పిల్లల్ని సాకినట్లు సాకిన గొడ్లను ఆటి కర్మానికి కాటి నొదిలేసి పొట్ట పట్టుకు నిక్కడికి వచ్చాం. రిక్షాతొక్కి రెండు డబ్బుల్తెస్తే పిల్లాళ్ళకు గంజి కాచి పొయ్యడం గగనమవుతాంది. ఎప్పటికా వానదేవుడికి దయకలుగుతుందో, ఎప్పటికి మా కష్టాలు గట్టెక్కుతాయో !!" హృదయ విదారకంగా విలపిస్తూ చెప్తూందో యిల్లాలు.

"మనకు తిండిలేకపోయినా, గొంతుక లెండిపోయి ఛస్తున్నా యెవడికి పడుతుందండీ ? పట్టించుకోవలసిన దొంగరాస్కెల్స్ అందరికీ యెవడి పదవి వాడికి. ఎవడి సింహాసనం వాడికి చల్లగావుంటే చాలు. ఎందరు ప్రభువులు మారినా మన అధ్వాన్నపు బతుకులుమాత్రం మారవు." కడుపు మండిన ఒకతను ఆవేశంగా అంటున్నాడు.

"కొంచెం ఖాళీ అయింది. నడవ్వే గౌరీ ముందుకు." చంకలోంచి జారిపోతున్న బిడ్డను పైకి తీసుకుంటూ గౌరిని అదిలించింది కాంతం. కాంతంచేతిలో బిడ్డను చూడగానే గౌరి హృదయంమీద వర్షపుచుక్క జారిపడినట్లుగా చిన్ని గిలిగింత కలిగింది. ఈ రోజు సెంటర్‌లో డాక్టరమ్మ తన చెవుల్లో అమృతంపోసింది. ఇన్నేళ్ళకు తన కడుపుపండి కష్టాలు తీరబోతున్నాయి. ఇన్నాళ్ళూ పిల్లలు పుట్టలేదని అత్త రాచిరంపాన పెడతాంది. ఈ గొడ్డుమోతుదాన్ని వదిలేసి నా కొడుక్కు మళ్ళీ పెళ్ళిచేస్తానని బెదిరిస్తాంది. అత్త అట్లా అన్నప్పుడల్లా తను భయంతో వజవజ వణికిపోతోంది. తనకు ఓ చిన్నారి పాపాయి పుట్టాకగాని అమ్మ మాటకు వంతపాడే ఆయనగారెదుట తలెత్తి నిలబడేందుకు శక్తి రాదు ఆప్యాయంగా పొట్టమీద చేత్తో తడుముకుంది గౌరి.

"తను బిడ్డ నెత్తుకున్నాక నీళ్ళు పుష్కలంగా దొరికే చోటికి పోదామని ఆయన్తో చెప్పాలి. కరువుదీరా స్నానంచేసి, కడుపు నిండా నీళ్ళు తాగగలిగేచోట యింక ఏ సుఖాల్నీ కోరుకోకుండానైనా బ్రతుకుదామని చెప్పాలి"—గౌరి ఆలోచనల్లో వుండగానే నీళ్ళ టాంకర్ వచ్చింది. ఒక్కసారిగా 'క్యూ' చెల్లాచెదురయి, బలాబలాలు చూసుకుంటూ తోసుకుని ముందుకు వెళ్ళి నీళ్ళు పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

తోపులాటలు, జుట్టుపట్లు, బిందెలతో యుద్ధం. క్షణంలో భీభత్సంగా మారిపోయింది. ఇటు బయటకు రాలేక, అటు నీళ్ళు పట్టుకోలేక తాపులు, తోపుళ్ళు భరిస్తూ భయంతో, కంగారుతో తబ్బిబ్బుపడిపోతూంది గౌ౨. ఇంతలో ఆ తోపుళ్ళాటలో అకస్మాత్తుగా ఎవరో వచ్చి గౌరిమీద పడడంతో ముందుకు తూలిపడింది. చేతిలోని బింది క్రిందపడి దానిమీద గౌరి పొట్ట బలంగా నొక్కుకుపోయింది.

రక్తంతో స్నానంచేసిన గౌరిని స్పృహ లేని స్థితిలో హాస్పిటల్‌కు చేర్చారు. గర్భస్రావమయి పోతూంటె పిండాన్ని తీసేసి రక్తం ఎక్కించాక గౌరికి తెలివొచ్చింది.

"నాకేమయింది డాక్టరమ్మగారూ? నా బిడ్డకేం కాలేదుగదా?" హీనస్వరంతో ఆతృతగా అడిగింది గౌరి.

"ఏమీ అవలేదు. అంతా బాగానే వుంది. నువ్వు విశ్రాంతిగా పడుకోవాలమ్మా!" గౌరి చూపుల్ని తప్పించుకుంటూ జవాబిచ్చింది డాక్టర్ శ్రుతి.

"నిజంగానా అమ్మగారూ?" అపనమ్మకంగా పొట్టను తడుముకుంది గౌరి. తన బ్రతుకు, భవిష్యత్తు తన బిడ్డమీద ఆధారపడి వున్నాయి. దానికేమన్నా అయితే తన బ్రతుకు కడగండ్లపాలవుతుందన్న నిజం ఆమెను భయవిహ్వలురాల్ని చేస్తూంది.

కూతుర్ని చూచి గొల్లుమన్న తల్లి ఏడుపువిని తృళ్ళిపడ్డ గౌరికి డాక్టరమ్మ తనకు సరైన సమాధానం చెప్పకుండా ఎందుకు తప్పించుకు వెళ్ళిపోయిందో అర్థమయింది. గౌరి కడుపులో నుంచి దుఃఖం కడలిపొంగులా ఉవ్వెత్తున కదిలి వస్తూంది. కన్నీళ్ళకు కరువులేకుండా జలజలరాలి ఆమె గుండెల్ని తడుపుతున్నాయి.

—డాక్టర్ ఆలూరి
విజయలక్ష్మి

# సత్యమైన కవిత్వం-రక్తం, విప్లవం=
# వాగ్దేవి కన్నీటివాన!!

మాకు మీ కవిత్వ తత్వ వివాదాలు తెలీవు
పదిమందిచేత చంకలు కొట్టించి జేకొట్టించుకోవడం మారాతలకురాదు
పదజాలాల కోసం గాలాలు వేయడం చేతగాదు
నిప్పుకొండలై వుడుకుతున్న మెదళ్ళు పగిలే సమయాన....
పీడితజన ఉద్విగ్న ప్రభంజనం లావాలై పొంగే తరుణాన....
ఉన్మత్త హృదంతర్హిత సంగీత ప్రకంపనాలు
ప్రేయసిపై వలపులు ప్రకోపింపజేస్తుంటే
మనో రోదసిలో స్వార్థ నక్షత్ర నివహంతో
అనంతానంత ప్రేమగీతాలు కంపోజ్‌చేసి
అంకితాలిచ్చి (మీరనే) వాగ్దేవి కన్నీటివానవడం అంతకన్నా చేతకాదు
మాకు!!
అక్షరగుచ్ఛాలతో భిక్షుక కుత్తుతార్పడం మీకు తెలిసినంతగా మాకు తెలీదు
ఎన్ని క్షతగాత్ర నావాల అగ్నిపర్వతాలు, మాలోని చివరి
జలబిందువుపై బోర్లపడి గర్జించాయో నువ్వెరుగుదువా మిత్రమా!
అనంతాఘాతాల విషాదాశ్రుపాతాలు మాలోని
భవిష్యదాశాజ్యోతిపై హోర్హోర్మని తుపాకులెత్తి
చేసిన కవాతులు.... మా కవిత(ల)లు!
ఉగ్ర రుధిరారుణోదయోద్దీప్తమైన ప్రాగ్దేవి నాహ్వానించడానికి
ప్రభాతాల బందిఖానాకు వేసిన
అజ్ఞానపు బీగాలకు తాళాలు ...మా విప్లవ కలాలు!!
కంకణం-రక్తం-విప్లవం....నిజమే, అవి మా లక్ష్యాలు
లక్ష్యంలేని మీ కవి'త్వా'క్షరాలు, కాగితాల్ని నరకడం చూసి
వాగ్దేవి కురిసిన కన్నీటివానను స్ట్రెటైజ్‌చేసేంత రక్తం
మా కవిత్వంలోంచి తర్పణంచేసి, ఆమె చేయిబట్టి
తప్పటడుగులు వేసుకుంటూ ...మా దారిలో ఆమెను నడిపించుకొంటూ
వెలుగు తలుపులు తెరుచుకొని కత్తికీ- కలానికీ తేడాతెలీని
మీ లాంటివారి దగ్గరకే వస్తున్న పసిపిల్లలం మేము ....
ప్రస్తుతం వేస్తున్న మావి తప్పటడుగులు కావచ్చు ....
'పెద్దలు' కనుక మమ్మల్ని చూస్తూండటానికి
మీరెప్పుడూ మా వెనకే వుండండి.

[22-10-82వ తేదీ "ఆంధ్రజ్యోతి" వారపత్రికలోని "ముళ్ళపూడి లలితానంద సాయి"గారి "వాగ్దేవి కన్నీటివానకు" జవాబు]

—సౌదామిని